క్లుప్తంగా

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులతో జిల్లా అధ్యక్షుడు నర్సింహ

యాచారం: ఎమ్మార్పీఎస్ మండల కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మూలి మహేష్, అధికార ప్రతినిధిగా మస్కు యాదగిరి, ఉపాధ్యక్షుడిగా మంద లింగం, ప్రధాన కార్యదర్శిగా కందుకూరి జగన్, కార్యదర్శిగా కొమ్ము విక్రం, సహాయ కార్యదర్శిగా మస్కు శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహ, మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రావుగల్ల బాబు తదితరులు హాజరయ్యారు. ఏబీసీడీ వర్గీకరణకు రాజీలేని పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహించొద్దు

ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి

యాచారం: ప్రజా సమస్యలపై ఏ మాత్రం నిర్లక్ష్యం చేయొద్దని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. తాగునీటి ఎద్దడి, డ్రైనేజీ సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అభివృద్ధి పనులు పర్యవేక్షించాలని సూచించారు. ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు నిత్యం గ్రామాలకు వెళ్లి ప్రజల సమస్యలు లేకుండా చూడాలన్నారు. ప్రతీ వారం సమస్యలపై సమీక్ష నిర్వహిస్తానని అన్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌కు సన్మానం



నరేశ్‌నాయక్‌ను సన్మానిస్తున్న గోవిందాయిపల్లి యువత

కడ్తాల్: ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన డైరెక్టర్‌గా నియమితులైన నరేశ్ నాయక్‌ను బుధవారం గోవిందాయిపల్లి గ్రామ యువత ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, యువనాయకుడు నరేశ్‌నాయక్ మార్కెట్ డైరెక్టర్‌గా ఎంపికవ్వడం హర్షణీయమన్నారు. రైతుల సంక్షేమం కోసం కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, మహేందర్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, రాజేందర్‌గౌడ్, రమేశ్, శ్రీనుగౌడ్, రాజు తదితరులు ఉన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి



క్రీడాకారులతో రాము, శ్రీరామ్

తలకొండపల్లి: విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని పాపిశెట్టి రాము విద్యార్థులకు సూచించారు. స్వామి వివేకానంద జయంతి వారోత్సవాల సందర్భంగా బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం క్రీడాపోటీలు ఏర్పాటు చేశారు. ఈ పోటీలను రాము, ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యుడు శ్రీరామ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. ఈ పోటీల్లో 12 పాఠశాలల నుంచి 500 మంది విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి రాజు, బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి పాండు, బీజేపీ మండలాధ్యక్షుడు రవిగౌడ్, మాజీ ఉప సర్పంచ్ అనిల్, జిల్లా కన్వీనర్ కృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భరత్, మహేష్, శ్రీకాంత్, శివ, విజయ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ జాబితాపై అఖిలపక్ష సమావేశం



అఖిలపక్ష నాయకులతో ఆర్డీఓ అనంతరెడ్డి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఆర్డీఓ కార్యాలయంలో అఖిలపక్ష నాయకులతో ఆర్డీఓ అనంతరెడ్డి బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఓటర్ల జాబితా, తప్పొప్పుల సవరణ జాబితాలను అఖిలపక్ష నేతలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్, టీడీపీ నాయకులు సామేల్, వంశీ, బోసుపల్లి ప్రతాప్, విజయ్, విజయ్‌కుమార్, నిట్టు జగదీశ్, రవీందర్ పాల్గొన్నారు.

వణికిస్తున్న చలి

- బయటకు వచ్చేందుకు జంకుతున్న జనం
- ఇబ్బంది పడుతున్న వృద్ధులు, చిన్నారులు
- రోడ్లను కమ్మేస్తున్న పొగమంచు



పల్లెలను కమ్మేస్తున్న పొగమంచు



పొగమంచు కారణంగా ఉదయం 8గంటలకు దర్శనమిస్తున్న సూర్యుడు

మంచాల: గతంలో ఎన్నడూ లేని విధంగా చలి పులి వణికిస్తోంది. దీంతో గ్రామాల్లోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చలి భయంతో ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. ఉదయం 8 గంటల తర్వాతే ఆయా పనుల నిమిత్తం కదులుతున్నారు. తిరిగి సాయంత్రం 5గంటల వరకే ఇల్లు చేరుతున్నారు. ఎముకలు కొరికే చలి కారణంగా వృద్ధులు, చిన్నారులు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. చిన్న పిల్లలకు దగ్గు, జలుబుతో ప్రారంభమై కఫంతో కూడిన జ్వరాలు వస్తున్నాయి. మరికొంత మంది పిల్లలు నిమోనియా బారిన పడుతున్నారు. కాళ్లు, చేతుల తిమ్మిర్లతో వృద్ధులు సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో పక్షవాతం బారిన పడే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వృద్ధులను వేడి వాతావరణంలో ఉంచాలని సూచిస్తున్నారు.

తెల్లవారుజామున....

తెల్లవారుజామున చలి కారణంగా ప్రజలు వాకింగ్‌కు కూడా రావడం లేదు. ఉదయం 7గంటల వరకూ పొగమంచు కమ్ముకుని ఉంటోంది. పొగమంచు కారణంగా అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్లన్నీ మంచు పొగతో కమ్ముకుంటున్నాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక రాకపోకలకు ఆలస్యం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని, వాహనదారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

చలి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రజలు తగిన జాగ్రతలు తీసుకోవాలి. ఉదయం, సాయంత్రం వేళల్లో చిన్న పిల్లలు, వృద్ధులు సాధ్యమైనంత వరకు బయటకు రావద్దు. తప్పని పరిస్థితిలో అయితే స్వెటర్, తలకు ఉలెన్ టోపీలు, కాళ్లు, చేతులకు గ్లౌజులు ధరించాలి. ఐదేళ్ల లోపు చిన్నారుల పట్ల తల్లిదండ్రులు తగిన అప్రమత్తంగా ఉండాలి. ఏ చిన్న సమస్య వచ్చినా వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ శ్రావణ్‌కుమార్, పీహెచ్‌సీ, మంచాల

ముఖ్యమంత్రిని కలిసిన నేతలు



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్: శంషాబాద్‌లోని జీఎంఆర్ ఏరినాలో బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడి కూతురు వివాహం జరిగింది. ఈ వివాహానికి హాజరైన సీఎం రేవంత్‌రెడ్డిని, పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ తలకొండపల్లి మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ఖానాపూర్ మాజీ సర్పంచ్ వెంకటరామిరెడ్డి, రాంచందర్‌నాయక్, సత్యం తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

సీఐటీయూ మండల కన్వీనర్ చందునాయక్



యాచారం ఎంఈఓ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న చందునాయక్

యాచారం: మధ్యాహ్న పథక భోజన బిల్లులు ఇవ్వకపోతే ఆందోళన తప్పదని సీఐటీయూ మండల కన్వీనర్ చందునాయక్ హెచ్చరించారు. బుధవారం ఆయన వివిధ పాఠశాలల వంట సిబ్బందితో కలిసి ఎంఈఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎంఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని 24 గ్రామాల్లోని పాఠశాలల్లో వంట సిబ్బంది అప్పులు చేసి విద్యార్థులకు భోజనం వండి పెడుతున్నారని అన్నారు. రూ.లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో పలుమార్లు పెండింగ్ బిల్లులు ఇవ్వాలని కోరిన స్పందన కరువైందన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలనే డిమాండ్ గురు, శుక్రవారం మండల కేంద్రంలో ధర్నారా చేపట్టనున్నట్లు వెల్లడించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మధ్యాహ్న భోజన కార్మికులు నరేందర్, పద్మ, అంశమ్మ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వసతులు కల్పించండి

అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ



అచ్చంపేట్ ఎమ్మెల్యే వంశీకృష్ణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆమనగల్లు ఏఎంసీ గీత

కడ్తాల్: ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్‌గా నియమితులైన యాట గీత స్థానిక నాయకులతో కలిసి అచ్చంపేట్ ఎమ్మెల్యే వంశీకృష్ణను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె ఎమ్మెల్యేను సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమాభివృద్ధి పథకాలను, కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని, మార్కెట్ ఆదాయాన్ని పెంచి రైతులకు మార్కెట్‌లో మెరుగైన వసతులు కల్పించేలా చూడాలని చైర్‌పర్సన్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

తుర్కయంజాల్: 11 కేవీ నాదర్‌గుల్ ఫీడర్ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ రవీందర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాదర్‌గుల్ గ్రామం, అశోక్ రెడ్డి కాలనీ, విజయ లక్ష్మీ కాలనీ, ఎంవీఎస్ కాలేజ్ ఏరియా కాలనీలు, గుర్రంగూడ, టీచర్స్ కాలనీ, శ్రీనివాసపురం, ఆదిత్యానగర్, గడ్డం ఎన్‌క్లేవ్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

పేదల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: పేదల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తి అసెంబ్లీ నియోజక వర్గంలోని బాధితులకు మంజూరైన చెక్కులను బుధవారం ఆయన నగరంలోని తన నివాసంలో అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వసతులు కల్పించి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నట్లు ఆయన వివరించారు. ఆమనగల్లులోని ప్రభుత్వాసుపత్రి భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీలు జక్కు అనంతరెడ్డి, నిట్టి నారాయణ, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శెట్టిపల్లి సత్యం, మెకానిక్ బాబా, విజయ్‌రాథోడ్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

వంశీచంద్‌రెడ్డిని కలిసిన మార్కెట్ కమిటీ డైరెక్టర్



వంశీచంద్‌రెడ్డితో శ్రీశైలం

ఆమనగల్లు: ఏఐసీసీ కార్యదర్శి, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డిని బుధవారం హైదరాబాద్ ఆమనగల్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమనగల్లు మార్కెట్‌కమిటీ డైరెక్టర్‌గా ఎంపికైన వస్పుల శ్రీశైలం ఈ సందర్భంగా తనకు అవకాశం కల్పించినందుకు చల్లా వంశీచంద్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వస్పుల శ్రీశైలంను చల్లా వంశీచంద్‌రెడ్డి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్ ఉన్నారు.

జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష



మాట్లాడుతున్న వైద్యాధికారులు

తలకొండపల్లి: వైద్యులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎంపీడీఓ శ్రీకాంత్ వైద్య సిబ్బందికి సూచించారు. లెప్రసీ, టీబీ వ్యాధులపై సర్వే నిర్వహించి రోగులను గుర్తించి మందులు పంపిణీ చేయాలన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. బాలింతల వివరాలు చేపట్టి వారికి క్రమం తప్పకుండా వ్యాక్సిన్‌లు ఇవ్వాలన్నారు. బీపీ, షుగర్ వ్యాధులున్న రోగులను గుర్తించి మందులను అందజేయాలన్నారు. ఫీవర్ సర్వే చేసి మండలంలో జ్వరం రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తల్లీబిడ్డల ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగార్జున, డాక్టర్లు సైదమ్మ, కల్పన, వైద్య సిబ్బంది ఆంజనేయులు, మల్లయ్య, రామచంద్రయ్య, చిట్టిబాబు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న ట్రాఫిక్ ఏఎస్‌ఐ సోమనాథ్‌గౌడ్

తుర్కయంజాల్: విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలని వనస్థలిపురం ట్రాఫిక్ ఏఎస్‌ఐ సోమనాథ్‌గౌడ్ సూచించారు. బుధవారం స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో ఏర్పాటు చేసిన స్మార్ట్ లివింగ్, సేఫ్ ఇండియా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలను ఇస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని, తల్లిదండ్రులతో పాటు, పిల్లలపైన కేసులు నమోదవుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శమంతకమణి, జోన్ కోఆర్డినేటర్ జితేందర్, డీన్ రాకేష్ రెడ్డి, ఏఓ మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనుల పరిశీలన



పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ వసంత

ఆమనగల్లు: పట్టణంలోని గిరిజన బాలికల వసతిగృహ విద్యార్థులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపాలిటీ నుంచి ప్రత్యేకంగా హాస్టల్ వరకు పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన పనులను బుధవారం మున్సిపల్ కమిషనర్ వసంత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



ఇరుముడిపూజకు హాజరైన ధశరథనాయక్ తదితరులు



అయ్యప్ప మహా పడిపూజలో స్వాములు

జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్

కడ్తాల్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని అన్మాస్‌పల్లిలోని వీరాంజనేయ ఆలయంలో పలువురు భక్తులు స్వామి వారి దీక్షలు తీసుకున్నారు. అనంతరం నిర్వహించిన ఇరుముడి పూజకు హాజరైన దశరథ్‌నాయక్ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు భక్తిభావాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింహ, చంద్రు, సేవ్యా, రవి, జగన్, హనుమాన్ మాల దారణ స్వాములు పాల్గొన్నారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ

మండల పరిధిలోని మక్తమాధారం గ్రామంలో అయ్యప్ప మాలధారణ స్వాముల ఆధ్వర్యంలో బుధవారం మహాపడి పూజ నిర్వహించారు. గురుస్వాముల ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. మాలధారణ స్వాములు ఆలపించిన భక్తిగీతాలతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ పాల్గొన్నారు.



ఎవరూ లేకపోవడంతో చెత్తా, చెదారంతో నిండిన పాఠశాల

ఉపాధ్యాయుల్లేక బడి మూత

శంకర్‌పల్లి:ఇటీవల డీఎస్సీలో ఉద్యోగం సాధించిన ఓ మాస్టర్ పాఠశాలకు రాకపోవడంతో ఆ పాఠశాల మూసివేశారు. దీంతో పాఠశాలలో చదివే నలుగురు విద్యార్థులు దగ్గరలోని మరో ప్రభుత్వ పాఠశాలలకు వెళ్తున్నా రు. మండలంలోని ఇరికుంట తండాలో ప్రభు త్వ ప్రాథమిక పాఠశాల ఉంది. ఈ ఏడాది ప్రారంభంలో ఆ పాఠశాలకు నలుగురు విద్యార్థులు వస్తుండగా.. ఉపాధ్యాయులు సరిగా లేకపోవడంతో వారు దగ్గరలోని దొంతాన్‌పల్లి, మహారాజ్‌పేట్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశా లకు వెళ్తున్నారు. అయితే 2024 డీఎస్సీలో ఉద్యోగం సంపాదించిన హైదరాబాద్ ప్రాంతానికి చెందిన బార్కం శ్రీశైలంకు ఇరికుంటతండాకు పోస్టింగ్ ఇచ్చారు. చిన్నప్పటి నుంచి దృష్టి లోపం కారణంగా శ్రీశైలం ఆ పాఠశాలలో రిపోర్ట్ చేసి, మరో రెండు రోజులు వచ్చి.. ఎవరికీ సమాచారం ఇవ్వకుండా పాఠ శాలకు రావడం మానేశాడు. తమ స్కూల్‌కు మాస్టరు వచ్చాడ ని సంతోషించిన విద్యార్థుల కు ఆ సంతోషం ఎంతో సేపు నిలవలేదు. దీంతో మళ్లీ విద్యార్థులు తమకు 5కి.మీ దూరంలో ఉన్న ఇతర ప్రభుత్వ పాఠశాలలకు వెళ్తున్నారు. దీనిపై మండల విద్యాధికారి అక్బర్‌ని వివరణ కోరగా..శ్రీశైలం పాఠశాలలో రిపోర్టు చేసి, వెళ్లాడు. మళ్లీ పాఠశాలలకు రాలేదు. దీని గురించి పలుమార్లు ఫోన్ చేసినా స్పందన లేదు. సమస్యను జిల్లా విద్యాధికారి దృష్టికి తీసుకెళ్తాం.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



విద్యార్థులతో ఉపాధ్యాయులు

మంచాల: మండలంలోని బండలేమూర్‌లో ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్, పుష్ప, పరిమళ, రాజు, ఐలయ్య, దత్తాత్రేయ విద్యార్థులు పాల్గొన్నారు.

సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు శంకుస్థాపన

ఇబ్రహీంపట్నం: గురునానక్ విద్యాసంస్థలో సోలార్ ప్లాంట్‌కు బుధవారం శంకుస్థాపన చేశారు. సోలారిస్ ఎనర్జీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి జీఎన్‌ఐ క్యాంపస్‌లో 400 కిలో వాట్ల సౌర విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. జనవరి 2025 నుంచి ప్రారంభమయ్యే ఈ ప్రాజెక్ట్ ప్రతీ ఏడాది 55,400 యూనిట్ల శుద్ధమైన విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుందని.. 600 టన్నుల కార్బన్ ఉద్గారాలను తగ్గించనున్నదని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రక్షణ మంత్రి సలహాదారులు డాక్టర్ సతీష్‌రెడ్డి, డాక్టర్ రాజాసింగ్, డాక్టర్ అశోక్‌కుమార్ పాండే, గురునానక్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ గగన్ కోహ్లీ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంఈఓ మనోహర్

కేశంపేట: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రజాపాలన విజయోత్సవాలను బుధవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులకు పునరుత్పాదక శక్తి వనరులు అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ వ్యాసరచన పోటీల్లో ఆంగ్ల మాధ్యమంలో పాపిరెడ్డిగూడ గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు అర్చన (ప్రథమ), క్రాంతి కిరణ్ (తృతీయ), కేశంపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి హారిక (ద్వితీయ) స్థానాల్లో నిలిచారు. తెలుగు మాధ్యమంలో కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విదార్థులు ధనూశ్(ప్రథమ), తులసి(తృతీయ), ఎక్లాస్‌ఖాన్‌పేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి సింధులు నిలిచారు. మండలస్థాయిలో గెలుపొందిన విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని మండల విద్యాధికారి చంద్రశేఖర్ అభినందించి, బహుమతులు అందించారు. కార్యక్రమంలో కేశంపేట జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విద్యావతి, ఉపాధ్యాయులు జగదీశ్వర్‌రెడ్డి, శ్రీశైలం, రాజేందర్, సీఆర్పీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
బి. కిరణ్‌కుమార్
9912220386